విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు,శుక్రవారం 08,సెప్టెంబర్ 2023

# కోనేరు రంగారావు సిఫారసులు అమలు చేయాలి...

జిల్లా మహాసభ ఏర్పాటు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

**విశాలాంధ్ర - తాడపత్రి :** కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారము పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఈనెల 10,11 వ తేదీలలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జల్లి విల్సన్, అవుల శేఖర్ హాజరవుతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలలో ఉపాధి హామీ పథకంను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులు అమలు చేసి భూమిలేని ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబమునకు మూడు ఎకరాల సాగు భూమి, నివేశ స్థలము మూడు సెంట్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో అనేక గ్రామాలలో పేద వ్యవసాయ కూలీలు మరణిస్తే పూడ్చుకోవడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి గ్రామంలో దళిత, గిరిజన వాడలకు రెండు ఎకరాల స్మశాన స్థలం కేటాయించాలని తదితర డిమాండ్ల పైన ఈ మహాసభలలో చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగయ్య, కేశవరెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు పెద్దయ్య సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ ఆగ్రహం..

**విశాలాంధ్ర - ఉరవకొండ :** జిల్లా పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైయస్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ వైయస్ విజయమ్మ సైకో కొడుకును కనిందని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. 40 సంవత్సరాల అపారమైన రాజకీయ అనుభవం కలదని చెప్పుకునే వ్యక్తి కుటుంబ వ్యవస్థ పట్ల, మహిళల పట్ల ఇంత నీచంగా మాట్లాడటం తన దిగజారుడుతనానికి నిదర్శనమని ఎమ్మెల్సీ విమర్శించారు.వైఎస్ విజయమ్మ వైయస్ రాజశేఖర్ రెడ్డి దంపతులు దేశ రాజకీయాల్లో సైతం ఆదర్శప్రాయులుగా నిలిచారన్నారు. జిల్లా పర్యటనకులో చంద్రబాబు హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వద్ద సెల్ఫీ తీసుకోవడం హాస్యాస్పదమని ఎమ్మెల్సీ విమర్శించారు. హంద్రీనీవా యొక్క సామర్థ్యాన్ని 40 టిఎంసిల నుంచి ఐదు టీఎంసీలకు తగ్గిస్తే వాటిని 40 టిఎంసిలకు పునరుద్ధరించి రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి అపర భగీరథు డిలా వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి తవ్వించిన కాలువ ముందు నిలబడి సెల్ఫీ తీసుకోవడం సిగ్గుచేటు అన్నారు.14 సంవత్సరాలు పాటు ముఖ్యమంత్రిగా ఉన్న తాను ఏనాడు రైతుల గురించి గానీ వ్యవసాయం గురించి ఆలోచించలేదని అంతేకాకుండా వ్యవసాయమే దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. తండ్రి కొడుకులు ఎంత తిరిగినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా, ప్రజలు వాస్తవాలు గమనించి వారిని నమ్మే పరిస్థి తుల్లో లేరని శివరామిరెడ్డి విమర్శించారు. ఐటీ నోటీసుల విషయంలో చంద్రబాబు, లోకేష్ తన సొంత మీడియా సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కూడా చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరుగక పోతే ప్రభుత్వంపై సమరమే...

- 15 న జింఖానా గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ...
- అగ్రీగోల్డ్ కసమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి

**విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం :** అగ్రిగోల్డ్ బాధితులుకు న్యాయం జరుగకపోతే ప్రభుత్వంపై సమర శంఖం పూరిస్తామని ఎపి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలసి 15 న విజయవాడ జింఖానా గ్రౌండ్స్ లో జరుగనున్న భారీ బహిరంగ సభ కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు తమ పిల్లల భవిషత్ కోసం అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేశారని సంస్థ చేసిన మోసానికి వారంతా ఆర్థిక సంక్షోభంలోనికి కూరుకుపోయారని విచారం వ్యక్తం చేశారు. తనను ముఖ్యమంత్రిని చేస్తే అగ్రిగోల్డ్ ఏజెంట్లు,బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు సీఎం అయ్యాక మాట తప్పి బాదితుల ఉసురు పోసుకుంటున్నాడని మండిపడ్డారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొచించాలన్నారు.అగ్రిగోల్డ్ సంస్థ దివాలా తీసినట్టు యాజమాన్యం ప్రకటించడంతో ఏజెంట్లు, ఖాతాదారులు అనేకమంది ఆత్మహత్యల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.అగ్రిగోల్డ్ బాదితులకు న్యాయం జరుగకపోతే పాలక ప్రభుత్వాలపై సమర శంఖం పూరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాదితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర నాయకులు ధనుంజయ, భాగ్యలక్ష్మి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య ,నారాయణస్వామి,రమణ, సంతోష్ ,ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయ్ స్వామి,జిల్లా ఉపాధ్యక్షుడు వంశి,నాయకులు మనోహర్,మహేష్,రవి తదితరులు పాల్గొన్నారు.

# పాత ఈవీఎం గోడౌన్ తనిఖీ

**విశాలాంధ్ర-అనంతపురం వైద్యం :** అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ లో ఉన్న పాత ఈవీఎం గోడౌన్ లను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తనిఖీ చేశారు.గురువారం డిఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీవో మధుసూదన్,పలువురు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జాయింట్ కలెక్టర్ పాత ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అందరి సమక్షంలో ఆయా ఈవీఎం గోడౌన్‌గదుల తలుపుల సీళ్లను జాయింట్ కలెక్టర్ తీయించారు.ఈవీఎంలను భద్రపరుస్తున్న తీరు పట్ల జాయింట్ కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ భద్రపరిచిన పాత ఈవీఎంలను హైదరాబాద్,ఘజియాబాద్ కి తరలించడం జరుగుతుందని, ఈవీఎంలను స్కాన్ చేసి పంపించడం జరుగుతుందన్నా రు. తహసిల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు,ఎన్నికలు విభాగం సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బీమా క్లైములును చెల్లించాలి

**విశాలాంధ్ర - జేఎన్టీయూఏ:** మరణించిన ఉపాధ్యాయులు భీమా క్లైములు నేటికీ చెల్లించలేదని వెంటనే పరిహారాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వాలని గురువారం ఎస్ టీ యు జిల్లా అధ్యక్షుడు జీ. సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎస్ రవి కిషోర్ ఏపీ జి ఎల్ ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ తేజ్ నాయక్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ఏపీ జి ఎల్ ఐ నూతన పాలసీని తీసుకున్న ఉపాధ్యాయులకు నేటికీ బాండ్లను జారీ చేయలేదని.. నెలవారి చందాలు టీచర్ల వారి ఖాతాలకు జమ చేసి ఆన్లైన్లో పొందుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

## యువగళం పాదయాత్ర పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి..

**విశాలాంధ్ర - శింగనమల:** నారాలోకేష్, చేపట్టిన యువగళం పాదయాత్ర పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సజావుగా సాగుతుంటే వైసిపి అల్లరి మూకలు యువగలం పాదయాత్ర లో పాల్గొన్న వాలంటీర్లు మరియు తెలుగుదేశం కార్యకర్తలపై దాడి చేయడం దుర్మార్గమైన చర్యని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన పాదయాత్ర వైసిపి నాయకులు ఎన్నో ఆటంకాల సృష్టించారని, వాటి నధిగమించి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సజావుగా జరుగుతున్న పాదయాత్ర పై దాడి చేసిన వైసిపి వారిని వదిలిపెట్టి వాలంటీర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం దుర్మార్గమని, అరెస్టు చేసిన వారిని పోలీస్ స్టేషన్లో ఉంచక వైసీపీ నాయకుల గోడౌన్ల లో పెట్టడం ఏమిటని, లోకేష్ పాదయాత్ర వైసీపీ నాయకులకి నిద్ర పట్టడం లేదని, ప్రజలలో వస్తున్న స్పందన చూసి ఎలాగైనా పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తున్నారని, నారా లోకేష్ కి నోటీస్ ఇవ్వడం అక్కడున్న తెలుగుదేశం పార్టీ అగ్ర నాయకులకు నోటీసులు పంపడం ఎంతవరకు సమంజసం అని, ఇలాగే కొనసాగితే ప్రజలే బుద్ధి చెప్తారని 2024లో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి...

**విశాలాంధ్ర -రాప్తాడు:** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని జిల్లా లెప్రసీ అధికారి ఎ.నాగన్న సూచించారు. రాప్తాడు కేజీబీవీలో గురువారం కుష్టు వ్యాధి లక్షణాలు నివారణ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలుగా దగ్గు, జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వెంటనే చికిత్స పొందితే నెల రోజుల్లోనే వ్యాధిని అదుపు చేయవచ్చున్నారు.పోషకాహారం తీసుకుంటూ చికిత్స చేయించుకుంటే వ్యాధిని అరికట్టవచ్చున్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎంఎల్ హెచ్ పీ లక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామి, కేజీబీవీ ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు అరుణ, సువర్ణ పాల్గొన్నారు.

## జాతీయ పోషకాహార కరపత్రాల విడుదల

**విశాలాంధ్ర - జేఎన్టీయూఏ :** బాలాజీ ఫార్మసీ కళాశాలలో గురువారం జాతీయ పోషకాహార వారోత్సవాల భాగంగా కరపత్రాలను కళాశాల చైర్మన్ డా. పల్లె కృష్ణ కిషోర్, కళాశాల మేనేజ్మెంట్ ప్రజెంటేటివ్ శ్రీకాంత్రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి శ్రీధర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. దేశంలో పోషకాహార లోపాలను అధిగమించి అవగాహన కల్పించేందుకు కరపత్రాలు విడుదల చేయడం జరిగిందన్నారు. పీచు పదార్థాలు, పండ్లు,గానుగ నూనెలను ఆహార పదార్థాలలో తీసుకోవడం వల్ల పోషకాహార లోపాలను అధిగమించవచ్చు అని తెలిపారు.అనంతరము బాలాజీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు,ప్రభుత్వఆసుపత్రి,కరపత్రాలను పంచిపెట్టారు.

# దమ్ముంటే కాపు అభ్యర్థిత్వాన్ని ప్రకటించుకోవాలి....కాలవ సవాల్

**విశాలాంధ్ర-రాయదుర్గం:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి రాయదుర్గం పర్యటన సభూతో నభవిష్యతి అన్న రీతిలో సాగిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తన పేరును(కాలవ శ్రీనివాసులు) చంద్రబాబు ప్రకటించిన సందర్భంగా గురువారం ఉదయం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అక్కడే విలేకర్లతో మాట్లాడారు. ఐదేళ్ల తర్వాత రాయదుర్గానికి వచ్చిన చంద్రబాబుకు అడుగడునా జనం నీరాజనాలు పలికారన్నారు. ఆయన నాయకత్వం ఈ రాష్ట్రానికి చారిత్రక అవసరమనే సత్యాన్ని రాయదుర్గం ప్రజానీకం చాటడం భవిష్యత్తు విజయానికి సంకేతమని ఆయన పేర్కొన్నారు. అదే సందర్భంగా రాయదుర్గం నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులే మళ్లీ ఉంటాడని విస్పష్టంగా ప్రకటించారన్నారు. పార్టీలో తన స్థాయి ఏంటో, అధినాయకుడికి తనపై ఉన్న ప్రేమానురాగాలు ఎలాంటివో చంద్రబాబు మాటల్లో స్పష్టమైందన్నారు. తాను కుప్పం వెళ్లి తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించాల్సిన అవసరం లేదని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే రాయదుర్గంలో టిడిపి సీనియర్ నాయకులు, పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఉన్నారని, ఎప్పుడూ కూడా ఆయనే అభ్యర్థిగా ఉంటాడని ప్రకటించడంపై కృతజ్ఞత తెలిపారు. 2024 లోనే కాకుండా మున్ముందు కూడా కాలవ శ్రీనివాసులే ఉంటాడని చెప్పడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. మంగళవారం జరిగిన బహిరంగ సభలో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించలేదని సాక్షి పత్రికలో ప్రత్యేకంగా దుష్ప్రచారం చేసిన "కాపు"నకు ఈ ప్రకటన చెంప పెట్టుగా మారిందన్నారు. మా నాయకుడు చంద్రబాబుకు తనపై ఉన్న నమ్మకంతో తాను ఆనాడే 2024లో రాయదుర్గం అభ్యర్థిగా ఉంటానని స్పష్టంగా ప్రకటించిన మాట మర్చిపోయావా అంటూ "కాపు" ను నిలదీశారు. ఎమ్మెల్యేకి అతని పార్టీలో అంతా స్థానమే ఉంటే రాయదుర్గం వైసీపీ అభ్యర్థిగా జగన్మోహన్ రెడ్డితో ప్రకటించుకోవాలని కాలవ శ్రీనివాసులు సవాలు విసిరారు. పనికిమాలిన, చెత్త ఎమ్మెల్యే "కాపు" తనపై దుష్ప్రచారం చేస్తున్నాడని, తన వ్యక్తిత్వాన్ని హననం చేయడానికి అడుగడుగునా సాక్షి పత్రికను వాడుకుంటున్నాడని ఆయన మండిపడ్డారు. పొరపాటున వైసిపి అభ్యర్థిగా కాపు రామచంద్రారెడ్డి పేరును జగన్మోహన్ రెడ్డి ప్రకటిస్తే తాను 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తానని కాలవ ధీమా వ్యక్తంచేశారు. స్వయంగా వైసిపి పార్టీ వాళ్లే "కాపు"నకు టికెట్ రాదని రాయదుర్గంలో జోరుగా ప్రచారం సాగిస్తున్నారన్నారు. కాపు కుటుంబ సభ్యులంతా రాయదుర్గంలో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని, కర్ణాటక మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, అలాగే పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. "కాపు"నకు పౌరుషం ఉంటే తాను చేసిన సవాల్ ను స్వీకరించి వారంలోగా రాయదుర్గం అభ్యర్థిగా తన పేరును జగన్మోహన్ రెడ్డి నోటి ద్వారా ప్రకటించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంత రెడ్డి, కురుబ హనుమంతు, బలరామి రెడ్డి, లాలేప్ప, క్లస్టర్ ఇంఛార్జీ కాలవ సన్నన్న, పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, కేశవ రెడ్డి, మైనార్టీ సెక్ ఉస్మాన్,మాజీ జెడ్పిటిసి విజయ్ కుమార్, సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

**విశాలాంధ్ర-శింగనమల:** పేదల అభ్యున్నతికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శింగనమల మండలం చిల్లేపల్లి, కొరివిపల్లి,జులాకాల్వ,వి.జలాలపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్దిని బుక్ లెట్ ద్వారా వివరించారు. గ్రామాల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రతి ఒక్కరికీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారన్నారు. కొరివిపల్లి గ్రామంలో నాలుగున్నరేళ్లల్లో వైస్సార్సీపీ ప్రభుత్వ పాలనలో డి.పద్మావతి కుటుంబానికి దాదాపు రూ.5,71,055 లక్షలు లబ్ది చేకూరిందన్నారు. సీఎం వైస్ జగన్మోహన్ రెడ్డినేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యంకొనసాగుతోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజా బలంతో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, డి.సి.యం.యస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైస్సార్సీపీ నాయకులు కంచి రెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు రాజారెడ్డి, శ్రీనివాసు రెడ్డి, మండల అధికారులు, వైస్సార్సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు నియామక పత్రాలు

**విశాలాంధ్ర-ఉరవకొండ :** ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో నూతనంగా ఎంపిక కాబడిన ఇద్దరు ఆశావర్కర్లకు మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి నియామక పత్రాలు అందజేశారు.గురువారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్తూరు వైస్సార్సీపీ నాయకులు రాజశేఖర్, షణ్ముక్ గౌడ్, శివ,డిష్ వెంకటేష్, నల్ల సుంకన్న, పుండుకుర గంగన్న, పొట్టి సుంకన్న ఆధ్వర్యంలో నూతన ఆశావర్కర్లు భీమక్క, సునితమ్మ, ఇందిరా నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వీపర్ గా నియమించబడిన లక్ష్మీ, విశ్వేశ్వరరెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుండి పనిచేయాలని సూచించారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్:** మండలంలోని లింగ దహాళ్, నెమకల్లు గ్రామాల్లో యాదవ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలమాలలు వేసి వేద పండితుల మధ్య ఘనంగా పూజలు నిర్వహించారు.అనంతరం గోపూజ,మహా మంగళహారతి,పంచామృత పాలాభిషేకం,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల యాదవ సంఘం అధ్యక్షులు శాంతయ్య, విరుపాక్షి పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - శింగనమల :** మండల కేంద్రంలోని ఆత్మా రామాలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుతో రామాలయం చేరుకుని అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణ అందరిని ఆకట్టుకుంది. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంకాలం రాధాకృష్ణ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మందు గుండు సామాగ్రితో మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర-యాడికి:** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని యాడికి మండలం అంతట శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాడికి మండల కేంద్రం లోని గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు, అనంతపురం జిల్లా వైసీపీ అధ్యక్షులు పైల నరసింహయ్య, యాడికి వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ మరియు ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు, అనంతరం యాదవ సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి బొంబాయి రమేష్ నాయుడు టెంకాయ కొట్టి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు, సాయంత్రం ఆలయ సమీపంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామ్మోహన్ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

N.M.ముస్తఫా మండల వ్యవసాయ అధికారి
ధర్మవరం , శ్రీ సత్యసాయి జిల్లా .

విశాలాంధ్ర దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

S.ఇనాయత్ భాషా కరాటే మాస్టర్ & జూడో NIS కోచ్
మల్టీ స్టార్ బుడోకాన్ కరాటే అకాడమి , ధర్మవరం , శ్రీ సత్యసాయి జిల్లా .

విశాలాంధ్ర దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అంకె రామాంజినేయులు
తారక్ చేయూత ట్రస్ట్ , జూనియర్ NTR ఫ్యాన్స్ అధ్యక్షులు
సాయినగర్ , ధర్మవరం , శ్రీ సత్యసాయి జిల్లా .

విశాలాంధ్ర దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

భైముతక రమణ స్టోర్ డీలర్
సంజయ్‌నగర్ , ధర్మవరం , శ్రీ సత్యసాయి జిల్లా .

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు,శుక్రవారం 08,సెప్టెంబర్ 2023



# కల్తీ కల్లు తాగినందుకు 30 మందికి అస్వస్థత

విశాలాంధ్ర - పెనుకొండ:మండల పరిధిలోని నాగులూరు, బండ్లపల్లి గ్రామాలకు చెందిన కొంతమంది గురువారం కల్లు తాగిన 30 మందికి అస్వస్థత ఏర్పడింది. వారికి కడుపులో మంట విరోచనాలు కావడంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి 17 మంది హిందూపురం ప్రభుత్వాసుపత్రికి 13 మంది వెళ్లి చికిత్స పొందుతున్నారు. మీరందరూ గురువారం ఈడిగ కాద్రప్ప కళ్ళు అమ్ముతున్న చోటుకు వెళ్లి కళ్ళు సేవించినట్లు ఇతను గత రెండు సంవత్సరాల నుంచి కళ్ళు అమ్ముతున్నట్లు బాధ్యతలు తెలిపారు. బాధితులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రాణాపాయ పరిస్థితి ఏమీ లేదని ఇబ్బంది లేదని డాక్టర్లు తెలిపారు. వారిని అబ్జర్వేషన్ లో ఉంచామని ఇప్పటివరకు ఎటువంటి ప్రాణాపాయ పరిస్థితిలో లేదని నెమ్మదిగా కోరుకుంటున్నారని డాక్టర్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులలో వివరణ అడగగా.....బండ్లపల్లి గ్రామంలో కళ్ళు అమ్మే కాద్రప్పకు లైసెన్స్ ఉందని గురువారం జరిగిన సంఘటన పై సేబ్ సీఐ సుబ్బారెడ్డిని వివరణ కోరగా ఎక్సైజ్ పోలీసుల తో శాంపిల్ సేకరించి జరిగిన సంఘటనపై విచారణ చేసి ఏమైనా విషపూరితమైందా ఎందుకలా జరిగిందని వాటిపై దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

# ఆపాల్సిన పోలీసులే దాడులు ప్రేరేపిస్తున్నారు..

- వైసీపీ నాయకుల దాడుల్లో పోలీసులు భాగస్వామ్యులే...
- మహిళల చీరలు లాగి కొట్టడం దారుణం...
- వెంకటగారిపల్లి ఘటనపై తీవ్రంగా స్పందించిన శ్రీరామ్..

విశాలాంధ్ర - బత్తలపల్లి : ఎక్కడైనా రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరిగితే.. ఆపాల్సిన పోలీసులు దగ్గరుండి దాడులు ప్రేరేపించడం ఏమిటని ధర్మవరం తెదేపా బాధ్యుడు పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లిలో కమ్యూనిటీ భవనానికి సంబంధించిన వివాదంలో బుధవారం రాత్రి వైసీపీ నాయకులు చేసిన దాడిలో టీడీపీ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్య చికిత్సలు పొందుతున్నారు. వారిని పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. దాడి ఎలా జరిగింది. అందుకు గల కారణాలు ఏంటని ఆరా తీశారు. అలాగే ప్రస్తుత వారి ఆరోగ్య పరిస్థితిని కూడా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఎక్కడైనా రెండు వర్గాల మధ్య, పార్టీల మధ్య ఘర్షణలు జరుగుతుంటాయని, వీటిని ఆపాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుందన్నారు. కానీ వెంకటగారిపల్లి గ్రామంలో మాత్రం ఇళ్లలో ఉన్న టీడీపీ నాయకులను పోలీసులే స్వయంగా బయటకు తీసుకొచ్చి వైసీపీ నాయకులు దాడులు చేసేలా ప్రోత్సహించారన్నారు. పైగా ఈ ఘటనలో అడ్డు వచ్చిన మహిళలపై కూడా దాడులు చేశారన్నారు. అంతే కాకుండా వారి చీరలు లాగి అవమానిస్తుంటే పోలీసులు వారిని కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు. ఈ దాడుల్లో టీడీపీ నాయకులు తీవ్రంగా గాయపడితే దాడి చేసిన వైసీపీ నాయకులు ఆసుపత్రిలో చేరుతారన్నారు. ఇటీవల ఇలాంటి సంఘటనలు రివాజుగా మారాయాన్నారు. ఇలా గ్రామాల్లోకి వెళ్లి పోలీసులే దాడులు చేయిస్తూ.. ఘర్షణలు ప్రేరేపిస్తుంటే వారిని ఏమనాలని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనకు ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు జక్కంపూడి నాగభూషణ, బోయపాటి రాము, లక్ష్మీనారాయణ, కాకర్ల సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కన్నయ్య వేడుకలలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర -ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణంలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న వేమయ్యయాదవ్, యాదవ్ కులస్తులు అతనిని సన్మానించి అతనికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. తదనంతరం వేమయ్య యాదవ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని కనీ వినిఎరుగని రీతిలో చాలా అద్భుతంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప యాదవ్, మండల సిపిఐ కార్యదర్శి చల్లా శ్రీనివాసులు,కృష్ణయ్య పాల్గొన్నారు.

## బస్ స్టేషన్ కు టెండర్ ఆహ్వానం

విశాలాంధ్ర -ధర్మవరం: ధర్మవరం డిపోకు చెందిన బత్తలపల్లి బస్ స్టేషన్ ప్రస్తుతం ఖాళీగా ఉందని, సదరు బత్తలపల్లి బస్ స్టేషన్ 15 సంవత్సరములకు టెండర్ ద్వారా బాడుగకు ఇవ్వడం జరుగుతుందని డిపో మేనేజర్ మోతిలాల్ నాయక్ తెలిపారు.అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ టెండర్ ఆమోద యోగ్యమైన వ్యాపారముకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. టెండర్ కొరకు ఈనెల 26వ తేదీన పూర్తి చేసిన టెండర్ ఫారం ను ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం-కడపనందు ఉంచిన టెండర్ బాక్సులో వేయవలెనని తెలిపారు. తదుపరి అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్స్ తెరవబడును అని తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టెండర్ ఫారాలు వెబ్ సైట్ లింకు నందు అగుపిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9959225859,7382860947కు గాని 73828 61410 కు గాని ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర -ధర్మవరం : పట్టణంలోని పోతుల నాగేపల్లి గ్రామంలో గురువారం గోకుల ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గోకులాష్టమి, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. తదుపరి హెూమ కార్యక్రమాలు కూడా అర్చకులు, భక్తాదుల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గోమాతలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుని చిత్రపటానికి, విగ్రహానికి, వివిధ పూలతో అలంకరించి అర్చకుడు రామశాస్త్రి ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి చిన్నారులు వేషధారణ వేసిన శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ అందరిని ఆకట్టుకొంది. చిన్నారులచే ఉట్టి కొట్టడమును చేయించిన వైనం అందరినీ ముగ్ధుల్ని చేసింది. తదుపరి అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కుటుంబ సభ్యులు, మురళి మోహన్ రెడ్డి, తదుపరి విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు పులిచెర్ల వేణుగోపాల్, ఏఎస్ఐ. రఘురాం, శివరామిరెడ్డి, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -బుక్కపట్నం: మండల కేంద్రంలోని ఒకటి, రెండవ సచివాలయం , మూడవ సచివాలయాలను గురువారం జిల్లా నోడల్ అధికారి శివారెడ్డి అకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు ప్రజలకు వలు సమస్యలపై వస్తూ ఉంటారని వారి సమస్యలను పరిష్కరించే దిశగా సచివాలయ అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని సమస్యల పరిష్కారానికే సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేసి ఇబ్బంది పనితీరిపై ఎంపీడీవో ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బుచ్చయ్య గారి పల్లి సర్పంచ్ రూప, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈ ఓ ఆర్ డి ఇందిరాబాల, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఎన్పీకుంట : నంబుల పూలకుంట-1 సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం శాసనసభ్యులు డాక్టర్ పివి.సిద్దా రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వ్యవసాయానికి పెద్ద పీట వేశారని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమగు విత్తనకాయలను కేంద్రాలలోనే అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, తహసిల్దార్ నరేంద్ర కుమార్, ఏవో లోకేశ్వర్ రెడ్డి,ఎంపీపీ రాము, సర్పంచ్ అంజనమ్మ, ఉప సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, ఎంపీటీసీలు రంగారెడ్డి, తిమ్మారెడ్డి, మక్బుల్ బి, ఆర్ బి కే అడ్వైజరీ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, వైకాపా నాయకులు వెంకటేష్, రామ సుబ్బారెడ్డి, గోవింద నాయక్, వెలిచలమల భాస్కర్ రెడ్డి , శ్రీరాములు, ఆర్.బి.కె సిబ్బంది ధనలక్ష్మి, యుగంధర్, నరసింహారెడ్డి , సంబంధిత అధికారులు మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - ధర్మవరం : నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్తును అందించడమే మా లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పోతుల నాగేపల్లి జగనన్న కాలనీలో 2.5 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కె.వి సబ్‌స్టేషన్ వారు లాంచనంగా ప్రారంభించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ లోని నూతనంగా అమర్చిన పరికరాలను సప్లై ఛానల్ వారు పరిశీలించి ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న కాలనీలో 6,700 కూ పైగా ఇళ్లను నిర్మించడం జరుగుతుందని వీరందరికీ విద్యుత్ సరఫరా లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసేందుకే ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం జరిగిందన్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా జగనన్న కాలనీయులకే కాకుండా రూరల్ పరిధిలోని పోతుల నాగేపల్లి, తుంపర్తి, మోటమర్ల, సీసీ కొత్తకోట, తదితర ప్రాంతాలలోని రైతాంగానికి నాణ్యమైన విద్యుత్తును అందిస్తామని తెలిపారు. గతంలో అయితే ఈ ప్రాంతాలకు ఎర్రగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుండడంతో లోడు ఎక్కువై, నాసిరకంగా విద్యుత్ సరఫరా కావడంతో అటు రైతులు, ఇటు ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ సబ్ స్టేషన్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ప్రజలు వ్యవసాయం పట్ల మక్కువ చూపుతున్నారని తెలిపారు. అంతేకాకుండా కొత్తగా మరిన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు గో, బత్తలపల్లి మండలం అప్రరా చెరువులో, ముదిగుబ్బ మండలం దొరిగల్లు ప్రాంతాలలో నూతనంగా నిర్మించేందుకు ప్రభుత్వం వేగవంతమైన చర్యలను చేపట్టిందన్నారు. తద్వారా రైతులకు లో వోల్టేజి సమస్య పూర్తిగా నివారించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, శంషాద్ బేగం, విద్యుత్ ఎస్సీఈ. సురేంద్ర, ఈఈ. రమేష్, డి ఈ ఈ. కిరణ్ కుమార్, డి ఈఈ. కన్స్ట్రక్షన్ శ్రీకాంత్ రెడ్డి, రూరల్ ఏఈ జానకి రామయ్య డి వన్ డి2ఏఈలు కొండారెడ్డి, నాగభూషణ, కన్స్ట్రక్షన్ ఏఈ నజీరుద్దీన్ పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పోతుల నాగేపల్లి, సిసి కొత్తకోట సర్పంచులు మౌనిక, పల్లి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

విశాలాంధ్ర-ధర్మవరం : ప్రతి మనిషి అవయవ దానాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని నేత్రదాన ప్రోత్సాహక సంఘం అధ్యక్షులు, చీఫ్ అడ్వైజర్ సుబ్బరాజు, అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం- వ్యవస్థాపకులు, అధ్యక్షులు. ఈశ్వర లింగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాంస్కృతిక మండలి లో గురువారం పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలకు మానవ అవయవాలపై అవగాహన సదస్సు సమావేశమును నిర్వహించారు. తదుపరి నేత్ర, దృష్టి, అవయవ, ప్రాణ, శరీర, వైద్య విద్యా దానముల యొక్క కరపత్రాలను రోటరీ క్లబ్, రెడ్ క్రాస్, ఆదర్శ సేవా సంఘముల ప్రతినిధులు విడుదల చేశారు. అనంతరం సుబ్బరాజు, ఈశ్వర లింగం మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీ నుండి 13వ తేదీ వరకు ధర్మవరం చెన్నై కొత్తపల్లి, నార్పింగపల్లి, తాడిమర్రి, రామగిరి, మండలాలలో గల జూనియర్,డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు, అధ్యాపకులకు శరీర అవయవ దానాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి స్వచ్ఛంద సేవా సంస్థ వారు మాకు సహాయ సహకారాలను అందించాలని వారు కోరారు. మానవత్వం మూర్తిభవించేలా ప్రతి ఒక్కరూ శరీర అవయవ దానం చేసినప్పుడే మానవతా విలువలు పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, ప్రసన్నకుమార్, షోలిగాళ్ళ వెంకటేష్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు, యువర్ ఫౌండేషన్ నాయకులు పోలా ప్రభాకర్, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి,కార్యదర్శి శివయ్య, కోశాధికారి సత్య నిర్ధారన్, ఆదర్శ సేవా సంఘం వ్యవస్థాపకులు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: జాతీయ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ టీఎస్ చైతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఆయన చాంబర్ నందు జాతీయ రోడ్డు విస్తరణ పనులపై మరియు సంబంధిత ఆర్డీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధికి ప్రధానమైన మౌలిక వసతుల కల్పనలో జిల్లాలో జాతీయ రహదారులు నిర్మాణంలో పురోగతిలో ఉండాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికి అత్యధిక రోడ్ల ప్రాజెక్టుల నిర్మాణం జరుపుకుంటున్నామని తెలిపారు.1200 ఎకరాల భూమికి అవార్డు ప్రకటించడం జరిగిందని. 800 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని, మిగిలిన భూమి త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్డిఓ లను ఆదేశించారు.యన్ హెచ్ 42,యన్ హెచ్ 716,342, రోడ్ల నిర్మాణం పనులకు భూసేకరణ కార్యక్రమం వేగవంతం చెయ్యాలని తెలిపారు. తొలితిగతన జిల్లాకు జి కొత్తపల్లి టు గోరంట్ల , జాతీయ రోడ్డు , జి, ముదిగుబ్బ బైపాస్, కదిరి బైపాస్, కైలావల్లి ఆర్ఓబి, బెంగళూరు టు కడవ, హిందూపురం ,పుట్టపర్తి, వంటి ప్రాంతాలకు మెరుగైన కనెక్టివ్ తో రోడ్డు పనులు వేగవంతం చేయాలని తెలిపారు, జాతీయ రహదారులకు జిల్లాలో ప్రభుత్వం ప్రైవేటు భూములు సేకరణ ముమ్మరం చేశామని తెలిపారు. రైతుల నుంచి అభ్యంతరాలు వస్తే సంబంధిత ఆర్డీవోలు భూ పరిహార సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని అందుకు కాంట్రాక్టర్లు , ఎన్ హెచ్ అధికారులు , రెవెన్యూ అధికారులు సమన్వయముతో పనిచేసి ముందుకు వెళ్లాలని తెలిపారు, ఎక్కడెక్కడ భూ పరిహారం రైతులకు అందలేదు సంబంధిత తాహసిల్దార్లు గుర్తించి వారికి పరిహారం అందించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రోడ్డు ఈ ఈజగదీష్ గుప్తా, గిడ్డయ్య , ఆర్డీవో లు కదిరి రాఘవేంద్ర, ధర్మవరం తిప్పే నాయక్, పుట్టపర్తి భాగ్య రేఖ సంబంధిత తాహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు శరీర దృఢత్వాన్ని పెంచుతాయి

విశాలాంధ్ర - ధర్మవరం : క్రీడలు మంచి ఆరోగ్యంతో పాటు శరీర దృఢత్వాన్ని కూడా పెంచుతాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం. శైలజ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా మండల స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎంఈఓ-1. రాజేశ్వరి, ఎంఈఓ-2. గోపాల్ నాయక్ లు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మండల స్థాయి పోటీలు అండర్-14, అండర్-17 స్థాయిలలో నిర్వహించారు. ఈ మండల స్థాయి క్రీడా పోటీలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ క్రీడల్లో వాలీబాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, కోకో, కబడ్డీ, యోగ, బ్యాడ్మింటన్ లాంటి ఏడు క్రీడా అంశాల కు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడా పోటీలు ఉదయం నుండి సాయంత్రం వరకు అత్యంత ఉత్సాహ భరితంగా జరిగాయి. శుక్రవారం నాడు అథ్లెటిక్స్ పరుగు పందెం, విసురుట, ఎగురుట లాంటి పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఎంఈఓ లు, హెచ్ఎం లు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా విద్యార్థులను తీర్చడమే పాఠశాలల యొక్క ముఖ్య లక్ష్యమని వారు తెలిపారు. ఈ మండల స్థాయి పోటీలల వివిధ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి నియోజకవర్గస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు. నియోజకవర్గ సాయి పోటీలకు వాలీబాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, కోకో, కబడ్డీ, యోగ, బ్యాడ్మింటన్ ను పంపడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల టీచర్ వేణుగోపాలాచార్యులు,పీడీలు- నాగేంద్ర, రఘునాథరావు, లక్ష్మీనారాయణ, పద్మ, అశ్విని, జగదీష్, మల్లేష్ తో పాటు ప్రైవేట్ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## హిందూ సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: హిందూ సాంప్రదాయాలను భావితరాలకు తప్పక అందించాలని డాక్టర్ వివేక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని యాదవ వీధిలో గల జయకృష్ణ స్వామి దేవస్థానంలో గోకులాష్టమి శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తొలుత గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ ఆభరణానంత చక్కగా అలంకరించి, శ్రీకృష్ణ గీతాలను ఆలపించారు. తదుపరి శ్రీకృష్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వహించి, శ్రీ కృష్ణాష్టమి యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. చిన్నారులచే శ్రీకృష్ణుడు గోపికల వేషధారణ అందరిని ముగ్ధుల్ని చేసింది. అనంతరం అన్నదాన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ బంధువులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 8 న మంత్రి గుమ్మనూరు జయరాం పర్యటన

విశాలాంధ్ర-పుట్టపర్తి: జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు మరియు రాష్ట్ర కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీస్ శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పుట్టపర్తి నందు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల ఎనిమిదో తేదీన ఉదయం కర్నూలు జిల్లాలోని ఆలూరు నుండి రోడ్డు మార్గం ద్వారాబయలుదేరి ఉదయం 10 గంటలకు శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్లోనే స్పందన సమావేశం మందిరంలో పెనుగొండశాసనసభ నియోజకవర్గ అభివృద్ధి సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం జిల్లా స్థాయి సాగునీటి సలహా మండలి సమావేశంలో ఇన్చార్జి మంత్రివర్యులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పెనుగొండ సబ్ కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, జల వనరుల శాఖ అధికారులు, తదితరులు పాల్గొంటారు కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

## పెన్షన్ తొలగించిన సాలమ్మకు.. పెన్షన్ వితరణ

విశాలంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 25 వ వార్డు పార్థసారథి నగర్ కు చెందిన సాలమ్మ అనే వృద్ధురాలు ఇటీవల ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు ఆ వృద్ధురాలు రోడ్డు వేయలేదని చెప్పింది. తదుపరి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఇటీవల" సేవ్ ధర్మవరం" అనే కార్యక్రమంలో భాగంగా ఆ వృద్ధురాలని కలవడం జరిగింది. ప్రజల సమస్యలను అడుగుతూ పోతూ, తుదకు సాలమ్మ అనే మహిళ వద్దకు సమస్యను అడగడానికి వెళితే, ఎమ్మెల్యేకు రోడ్డు వేయమని చెప్పానని తెలిపింది. చిలకం పర్యటించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో, సాలమ్మకు వచ్చే పెన్షన్ హఠాత్తుగా తొలగించారు. దీంతో ఆ సాలమ్మకు అండగా తానుంటానని చిలక మధుసూదన్ రెడ్డి భరోసా ఇస్తూ, ప్రతినెల 3000 రూపాయలు పెన్షన్ తానే చెల్లిస్తానని హామీ ఇచ్చిన కారణంగా, గురువారం జనసేన పార్టీ నాయకులు సాలమ్మకు పెన్షన్ డబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల ప్రకాష్ రెడ్డి, బత్తలపల్లి మండల కన్వీనర్ పురం శెట్టి రవి, తలారి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోవింద పట్టాభిషేకం

విశాలాంధ్ర - ధర్మవరం : పట్టణంలోని కోట బ్రాహ్మణ వీధిలో గల వెన్న ముద్దల వేణు గోపాలస్వామి ఆలయములో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల ఏడవ, ఎనిమిదవ తేదీలలో అంగరంగ వైభవంగా రెండు రోజు లు పాటు ఆలయ ట్రస్టు,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు గురువారం ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకములను వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఉయ్యాలో సభ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించగా, ఈ కార్యక్రమం భక్తాదులను ఎంతగానో ఆకట్టుకుంది. ఉదయము ప్రసాద దాతలుగా తీర్థాల కృష్ణకుమారి,ఉయ్యా లోత్సవ ఉభయ దాతలుగా కాటం లక్ష్మీనారాయణ, కాటం రామకృష్ణ, కాటం,వీరనారాయణ, కాటం పవనజ్ కుమార్-భాగ్యలక్ష్మి మెడికల్స్ ధర్మవరం,రాత్రి ప్రసాద దాతలుగా టెంపుల్ స్టోర్స్, ఉయ్యా లోత్సవ ఉభయ దాతలు నిర్వహించారు. భక్తాదులకు ఎటువంటి అసౌకర్యము లేకుండా అన్ని ఏర్పాట్లను ట్రస్టు కమిటీ సభ్యులు నిర్వహించారు. శుక్రవారం నాడు కల్యాణోత్సవంతో ఈ వేడుకలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శేషగిరిరావు, సభ్యులు సుదర్శన, తీర్థాల వెంకటరమణ, సత్యనారాయణ, అశ్వత్ నారాయణ, ప్రసాదు, ఆలయ ట్రస్ట్ అధ్యక్షులు శేష సాయి, కార్యదర్శి తీర్థాల వెంకటరమణ, కోశాధికారి సుమంత్ కుమార్, డైరెక్టర్లు సత్యనారాయణ రావు, రామారావు, లక్ష్మీనారాయణ, దేవత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కంటి వెలుగు ద్వారా కళ్లద్దాలు పంపిణీ

విశాలాంధ్ర - బుక్కపట్నం : మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో గురువారం జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్ కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో వృద్ధులు, మహిళలను ఐస్క్రీనింగ్ ద్వారా కళ్ళను పరిశీలించి దాదాపు 173 మంది కి అద్దాలను పంపిణీ చేశారు. మిగిలిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరికి కంటి అద్దాలను పంపిణీ చేస్తామని తెలిపారు. సర్పంచ్ వెంకట రమణయ్య, ఆప్త మాలిక్, అధికారులు బషీర్ అహ్మద్, సునీల్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ రామమోహన్, హెల్త్ అసిస్టెంట్ మురళీకృష్ణ గౌడ్,వైద్య సిబ్బంది సుమలత,రాధా,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర -ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల కేంద్రంలోని పలుచోట్ల జరిగిన కన్నయ్య వేడుకలలో పాల్గొన్న ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు పాల్గొన్నారు.వారిని సన్మానించి వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలుచోట్ల శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిపి మండల వ్యాప్తంగా వచ్చినటువంటి భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్ నాయుడు, తుమ్మల మనోహర్, సోమల వినోద్ బాబు, కృష్ణమూర్తి యాదవ్, గడ్డమోహన్, చిన్నగాని నరసింహ యాదవ్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓడిచెరువు రూరల్ లో

కదిరి లో

లేపాక్షి లో